
ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



నేడు స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర

పార్వతీపురం : జిల్లా వ్యాప్తంగా స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంపై సంబంధ అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిషేధం" అన్న నినాదంతో చేపడుతున్నామన్నారు. జిల్లాలో 451 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామస్థాయిలో కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుటకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. శనివారం నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సాలూరులో పాల్గొంటారని, మిగిలిన ప్రజాప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమం విజయవంతం కావాలని ఆదేశించారు.

ముందుకెళ్తే నుయ్యి... వెనక్కుపోతే గొయ్యి అన్న చందంగా ఉంది జిల్లాలో ఇంటి నిర్మాణ లబ్ధిదారుల పరిస్థితి. అరకొరగానైనా అదనపు సాయం అందుతుందని సరదా పడాలో... లేక పట్టుమని పదిహేను రోజుల్లో ఇంటి నిర్మాణ పనులు పూర్తిచేసుకోలేక అవస్థలు పడాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పెరిగిన గృహ నిర్మాణ సామగ్రి ధరలతో పోలిస్తే ప్రభుత్వం పెంచిన సాయం ఏమూలకూ సరిపోదని కూడా లబ్ధిదారుల నుంచి వినిపిస్తోంది.



- అదనపు సాయం అంతంతే
- మార్చి 31తో ముగియనున్న గడువు
- ఆందోళనలో ఇళ్ల లబ్ధిదారులు

అరకొర సాయం.. ముంచుకొస్తున్న సమయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో పిఎంఇవై (ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ్, అర్బన్, పిఎం జన్‌మన్ పథకాల ద్వారా ఇళ్లు మంజూరుచేసిన సంగతి తెలిసిందే. ఇంటికి రూ.1లక్షా 80వేలు మాత్రమే మంజూరు చేశారు. దీంతో, చాలా సగానికి సగం మంది ఇంటి నిర్మాణానికి ముందుకు రాలేదు. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి, తాళాలు అందజేస్తుందని చెప్పడంతో ఈ పద్ధతిని కొందరు ఎంచుకున్నారు. మొత్తానికి ఇంటి నిర్మానానికి ఈ సొమ్ము ఏమాత్రం సరిపోయే పరిస్థితి లేకపోవడంతో పూర్తిచేసిన ఇళ్లు 40శాతానికి మించలేదు. 30శాతం ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోగా, మిగిలిన 30శాతం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. మరోవైపు ఈ పథకాల కాలపరిమితి ఈ నెల 31వ తేదీతో ముగిసిపోనుండడంతో ఆ తరువాత బిల్లులు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు. కేవలం 15రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తిచేయడం ఎలా సాధ్యమౌతుందని లబ్ధిదారులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్మాణ పనులను ప్రోత్సహించాలనే ఉద్ధేశంతో బిసి, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, పివిటిజిల (ఆదిమ తెగలు) కు రూ.1 లక్ష వంతున అదనపు సాయం ప్రకటిస్తూ ప్రభుత్వం ఈనెల 10వ తేదీన జిఒ నెంబర్ 9 విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే, పెరిగిన సిమెంట్, ఇసుక, ఇనుము, భవన నిర్మాణ కూలీలు రేట్లను బట్టి అది ఏమాత్రం సరిపోని పరిస్థితి. పెంచిన సాయంతో కలిపి బిసి, ఎస్‌సిలకు రూ.2.30లక్షలు, ఎస్టీలకు రూ.1.55లక్షలు, పిటిజిలకు రూ.2.80లక్షలు మాత్రమే. వాస్తవానికి రెండు సెంట్ల స్థలంలో ఒక ఇంటి నిర్మాణం చేపట్టాలంటే రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడి అవుతుందని భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పిటిజిలు కొండకోనల్లోకి మెటీరియల్ తీసుకెల్లడం అంటే మాటలు కాదు. ఈలెక్కన లబ్ధిదారులు తక్కువలో తక్కువగా కనీసం రూ.5లక్షల వరకు తమ వాటాగా పెట్టుకోవాల్సివుంటుంది. ఏదోలా ముందుకు సాగుదామనుకున్నవారికి కూడా సమయం పెద్దగా లేదు. కేవలం 16రోజులు మాత్రమే సమయం ఉంది. ఈనేపథ్యంలో పథకం రద్దుకాకుండా సమయం పెంచాలని కొందరు, యూనిట్ విలువ ఇంకా పెంచితే తప్ప నిర్మాణాలు చేపట్టలేమని మరికొందరు లబ్ధిదారులు కోరుతున్నారు.

విజయనగరంలో..

ఒసిల సంగతి కాస్త అటుంచితే ప్రభుత్వం సాయం ప్రకటించిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పివిటిజిలకు చెందిన 15,226 మంది లబ్ధిదారులు తమ ఇళ్లను కట్టుకోలేక ప్రారంభించకపోవడం, మధ్యంతరంగా ఆపేయడం వంటి దశలో ఉండిపోయారు. వీరిలో 12,240 మంది బిసిలు, 2,231 మంది ఎస్సీలు, 565 మంది ఎస్టీలు, 190 మంది ఆదిమతెగలవారు ఉన్నారు.

పార్వతీపురం మన్యంలో..

పార్వతీపురం మన్యం జిల్లాలో 10, 717 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో 4109 బిసి, 1169 ఎస్సీ, 3073 ఎస్టీ, 2366 పిటిజి లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఇప్పటికిప్పుడే ఏం చేయాలో అర్థ కాని పరిస్థితి నెలకుంది. మరోవైపు ఈ నెల 18 నుంచి 22 వరకు ఇళ్ల నిర్మాణాల వద్దకు గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్, సంక్షేమ కార్యదర్శులు వెళ్లి వాటిని ఫోటోలు తీసి హౌసింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారని అధికారులు చెబుతున్నారు.

విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

సొంత గనులు కేటాయించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకుని సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్టు కార్మికులను తొలగించే యోచనను విరమించుకోవాలని సిఐటియు ఆధ్వర్యాన స్థానిక పాతబస్టాండ్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ఆంధ్రులు హక్కు విశాఖ ఉక్కు అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు వీరోచితంగా ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాణ త్యాగం ఫలితంగా ఏర్పడిందన్నారు. ఈ ప్లాంట్‌కు వేలాది ఎకరాల భూములు రైతులు అందజేశారన్నారు. అలాగే రాష్ట్రంలో ఆర్థికంగా, ఉద్యోగ, ఉపాధి పరంగా వెన్నుముకలా నిలిచిన స్టీల్ ప్లాంట్‌ను బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజలు ఆస్తిని కార్పొరేట్ దోపిడీదార్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయమని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటుపరం చేయమని ప్రకటించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయుకులు రెడ్డి వేణు, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు పాల్గొన్నారు.



పట్టణంలోని నిరసన ర్యాలీ చేస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సహించం

పార్వతీపురంరూరల్ : విశాఖ స్టీల్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను తొలగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటం కొనసాగించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్ లో హమాలీలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా తొలగించిన 248 మంది కార్మికులను ఈనెల 15 లోగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాత పూర్వకంగా తెలియచేయాలని ఉక్కు యాజమాన్యాన్ని రీజినల్ లేబర్ కమిషనర్ ఆదేశించార న్నారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ తొలగింపులకు పాల్పడవద్దని కుమార్ హెచ్చరించారు. గతంలో అక్రమంగా తొలగించిన కార్మికుల అంశం, పనులు నిలిపివేసిన టెండర్లపై ఈనెల 19న యాజమాన్యంతో చర్చలు ఉంటాయిని తెలిపారు. ఈ చర్చల్లో యాజమాన్యం అక్రమంగా తొలగించిన వారిని తీసుకోవడం, అలాగే నిలిపివేసిన టెండర్ల పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు రాగోలు దుర్గాప్రసాద్, పకీరు, రాము తదితరులు పాల్గొన్నారు.

నవోదయం 2.0 పై ప్రచారం

గుమ్మలక్ష్మీపురం : నాటు సారా తయారీ, అమ్మకం, రవాణా చేయొద్దని ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0పై శుక్రవారం జియమ్మ వలస మండలంలో గజపతినగరం ఎక్సైజ్ ఎస్ఐ పి.నరేంద్ర ఆధ్వర్యంలో చినబుడ్డిడి, అర్నాడ, గడసింగపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అలాగే బొబ్బిలి ఎస్ఐ ఎ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కుందరు తిరువాడ, పెదతుంబలి, శిఖబడిలో గ్రామస్తుల సహకారాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు సారా వల్ల కలిగే నష్టాలు వివరించారు.

యంత్రాలతో ఉపాధి పనులు

- కూలీలతో చేయించినట్లు బిల్లులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఉపాధి పనుల్లో అధికారులు కొత్తరకం అవినీతికి తెరతీస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో విలేకర్లతో గంగు నాయుడు మాట్లాడారు. మక్కువ మండలం వెంకట బైరిపురంలో ఫారం ఫండ్‌ను, ఇంకుడు గుమ్మలను ఉపాధి కూలీలతో తవ్వించకుండా, యంత్రాల (జెసిబి)తో గోతులు తవ్వి ఉపాధి కూలీలు తవ్వినట్లు బిల్లులు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వెంకట బైరిపురంలో దళితులు, గిరిజనులు, పేదలకు ఉపాధి పనులు ఇవ్వకపోవడంతో వలసలు వెళ్లి పోవడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కూలీలు చేయలేని పనులిచ్చి ఆ పనులను ఉపాధి అధికారులు, రాజకీయంగా పలుకుబడి ఉన్న వారికి యంత్రాలతో పనులు చేయించి కూలీలు చేసినట్లు బిల్లులు చెయ్యడానికి చూస్తున్నారని అన్నారు. వెంటనే డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జియ్యమ్మవలస మండలంలో బిటి రోడ్డు పనుల్లో సరైన గ్రావిల్ వాడడం లేదని చెప్పారు. మండలంలో గల తుంబలి వద్ద మట్టి తీసుకొచ్చి పెదమేరంగి నుంచి బాసంగి-గడబవలస రోడ్డుకు, బిజె పురం నుంచి లోతువానివలస రోడ్డుకు వేశారని తెలిపారు. కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారం మట్టి వేసి రోడ్డు పనులు చేస్తుంటే ఉపాధి, జిల్లా మైనింగ్ అధికారులు కానీ కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మక్కువ మండలం దబ్బగెడ్డ అటవీ భూమిలో అక్రమ మైనింగ్ చేసి రోడ్డుకు వేశారని, అలాగే జియ్యమ్మవలస మండలంలో ఆవుల్లేని వారికి గోశాలలు మంజూరు చేశారని చెప్పారు. ఇలా ప్రతి జిల్లాలో ఉపాధి అధికారులు అవినీతికి తెరలేపుతున్నారని చెప్పారు. అవసరమైన కూలీలకు ఉపాధి పనులు కల్పించడం లేదని, వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసు కోవాలని, పని అడిగిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.


వెంకటబైరిపురంలో జెసిబితో తవ్విన ఇంకుడుగొయ్యిలు

డ్రోన్లతో గిరిజన గ్రామాలకు మందులు

- సంక్షేమం, అభివృద్ధి మాతోనే సాధ్యం
- గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీతో వ్యవసాయదారులకు ఉపయోగ పడుతూ డ్రోన్‌ల ద్వారా మందులు, ఆహార సరఫరా చేయడం ప్రారంభమైందని, త్వరలో గిరిజన గ్రామాలకు డ్రోన్‌ల ద్వారా మందులు పంపిణీ చేపడతామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్న, సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందాలన్నా టిడిపి కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రం రూపు రేఖలు మారుతాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడిదారులు ఒక్క కంపెనీ కూడా పెట్టడానికి సహసించలేదని, ఉన్న కంపెనీలను కూడా వైసిపి నాయకులు భయభ్రాంతులకు గురిచేసి పక్క రాష్ట్రాలకు వెళ్ళగొట్టే విధంగా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో సుమారు లక్షల కోట్లతో వివిధ రకాలైన కంపెనీలను స్థాపించేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. సూపర్ సిక్స్ లో కార్యక్రమంలో భాగంగా ప్రతి పథకాన్ని అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని అందులో భాగంగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం కార్యక్రమం కింద పదిహేను వేల రూపాయలను అందిస్తామని తెలిపారు. వైసిపి నాయకుడు జగన్ ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడడానికి ఒక్కరు ఉన్నా అసెంబ్లీలో వచ్చి తన గొంతు వినిపించాలని అన్నారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ముఖి సూర్యనారాయణ, గుల్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి


పెట్రోలింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

మహిళల రక్షణకు శక్తి టీం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేం దుకు, మహిళలకు/చిన్నారులకు రక్షణగా, ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లాలో శక్తి టీమ్‌లను నియమించామని ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్‌లతో ఈ కార్యక్రమాలపై దిశా నిర్ధేశం చేశారు. ఈ శక్తి టీమ్‌లు జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను, రద్దీ ప్రదేశాలను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. దీనిలో భాగంగా పార్వతీపురం, పాలకొండ, సాలూరులో ఐదుగురు పోలీసు సిబ్బంది చొప్పున 03 బృందాలుగా 15మందితో శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఒక్కొక్క బృందానికి ఎఎస్‌ఐ నాయకత్వం వహిస్తారని అన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి టీమ్‌ల కోసం ప్రత్యేకంగా కేటాయించిన పెట్రోలింగ్ వాహనాలను వినియోగి స్తున్నామ న్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో యాప్‌ను నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషను చేయాలన్నారు. ఈ బృందాల పనితీరును జిల్లాలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై పర్యవేక్షిస్తారని, అలాగే డిజిపి కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి అంకిత సురాన ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు నాయుడు, రాంబాబు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్, శక్తి టీమ్‌ల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భామిని : స్థానిక మోడల్ స్కూల్, కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి ఆంగ్ల మాధ్యమం గ్రూపుల్లో ప్రవేశాలు పొందగోరు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పై అర్హతలు కలిగిన విద్యార్థులు https://apms.apcfss.in, https://cse.ap.gov.in వెబ్‌సైటు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసేందుకు ఆఖరు తేదీ 22-5-2025. ఇతర వివరాలకు ప్రిన్సిపల్ 9440322964, 9542078996 ను సంప్రదించగలరు

మున్సిపల్ కమిషనర్ సరెండర్

- కలెక్టర్ ఉత్తర్వులు జారీ
- ఇన్‌ఛార్జిగా డిఇకి బాధ్యతలు

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ కమిషనర్ విహెచ్ సత్యనారాయణను సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాత్రి మున్సిపల్ కార్యాలయానికి ఉత్తర్వులు చేరాయి. ఇంఛార్జి కమిషనర్‌గా డిఇ ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లాలో వున్న మున్సిపల్ కమిషనర్ లతో జిల్లా కలెక్టర్ శ్యాం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మున్సిపాలిటీ ల అధికారులు కాన్ఫరెన్స్‌లోకి వచ్చినా సాలూరు కమిషనర్ సత్యనారాయణ రాకపోవడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్పటికే కమిషనర్ సత్యనారాయణ వ్యవహారశైలిపై కలెక్టర్ తీవ్ర అసంతప్తితో ఉన్నారు. కలెక్టర్ తో పాటు ఇతర మున్సిపల్ ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్ లకు, సమీక్ష సమావేశాలకు ఆయన హాజరు కాకపోవడంతో పాటు మున్సిపల్ కార్మికుల సమ్మె చేపడుతుండడం, వారి సమస్య పరిష్కారానికి చొరవ చూపించక పోవడంతో కమిషనర్ సత్యనారాయణను సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. అయితే డిఇ ప్రసాద్‌ను ఇంఛార్జి కమిషనర్‌గా తాత్కాలికంగా నియమించినట్లు తెలుస్తోంది. కమిషనర్ బాధ్యతలు నిర్వహించడానికి డిఇ ప్రసాద్ కూడా ఆసక్తి చూపడం లేదు. ఆయన వద్దంటే తర్వాత మున్సిపల్ ఆర్ఒ లేదా, మేనేజర్ లను కమిషనర్ గా నియమించే అవకాశాలు ఉన్నాయి.


కలెక్టరేట్ వద్ద ఆందోళన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాలల మూసివేతకు పన్నాగం

25న తల్లిదండ్రులతో కలిసి ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో మోడల్ పాఠశాలల ఏర్పాటు ద్వారా ఉన్న ప్రాథమిక పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహనరావు, ఎస్.మురళీమోహన్ రావు చెప్పారు. శుక్రవారం జరిగిన యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ మోడల్ పాఠశాలల ఏర్పాటు ముసుగులో ప్రాథమిక పాఠశాలల ఎత్తివేత, యుపి పాఠశాలల తరగతుల తగ్గింపు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో మన ఊరు బడిని కాపాడుకునేందుకు గ్రామాల్లోని తల్లిదండ్రులు, యువకులు, విద్యార్థులతో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 25 సాయంత్రం 4 గంటలకు తల్లిదండ్రులతో జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు చెప్పారు. ఈ సందర్భంగా వారు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.


ప్రభుత్వ స్థలాన్ని చదును చేయిస్తున్న కబ్జాదారు

ప్రభుత్వ స్థలంపై బడాబాబుల కన్ను

- రూ.కోట్లు విలువ చేసే భూమిని కొట్టేయాలని యత్నం
- హెచ్చరిక బోర్డున్నా చదును చేస్తున్న వైనం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాల పర్వం కొనసాగుతోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలాలను బడాబాబులు వదలడం లేదు. కర్షకమహర్షి ఆసుపత్రి సమీపంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి చదును చేస్తున్నట్లు తెలుస్తోంది. కోట్ల విలువైన ఈ స్థలాన్ని గతంలో ఒక జాతీయ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. అప్పుడే రెవెన్యూ అధికారులు ఈ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డు పెట్టారు. అయితే హెచ్చరిక బోర్డున్నా ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి చదును చేసే పనులు చేపట్టడం గురువారం కనిపించింది. అధికారపార్టీకి చెందిన ప్రముఖ నాయకుడి మనుషులే ఈ భూమిని కొట్టేసే పనిలో చదును చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పట్టణంలో విలువైన ప్రభుత్వ చెరువులు, భూములు కబ్జాకు గుర య్యాయి. ఈ విషయాన్ని అధికారపార్టీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇటీవల అసెంబ్లీ సమావేశా ల్లో ప్రస్తావించారు. పట్టణ పరిధిలోని సుమారు 40 ప్రభుత్వ చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణం నడిబొడ్డున ఉన్న 20 సెంట్ల భూమిని కూడా కాజేయడానికి బడాబాబులు స్కెచ్ వేయడం చర్చనీయాంశమవు తోంది. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు కళ్లు తెరిచి ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాల కు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపి రాష్ట్ర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా షేక్ నూరెల్లా

కురుపాం : కురుపాంకకు వైసిపి నాయకుడు షేక్‌నూరుల్లాకు వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన రెడ్డి ఆదేశాల మేరకు మైనార్టీ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం తాడేపల్లిగూడెం నుండి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆశీస్సులతో తనకు పదవి వచ్చిందని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రంగులు పూసుకుంటూ సందడి చేస్తున్న చిన్నారులు

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి - కురుపాం


హోలీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కురుపాం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో చిన్నారులు, పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నపిల్లలు అయితే ఉదయం నుంచి ఒకరికి ఒకరు రంగులు రాసుకుంటూ వీధుల్లో తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ కుల, మతాలకు సంబంధం లేకుండా హోలీ రంగులు వలె అన్ని మతాలు అన్ని కులాలు వారు సామరస్యంగా జరుపుకునే ఏకైక పండుగ హోలీనేనని అన్నారు.

సీతంపేట: మండలంలో యువకులు, పిల్లలు హోలీ పండగను ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. రంగులు పూసుకొని సరదాగా గడిపారు. రంగులు పూసుకుంటూ ఆనందాలు పంచుకున్నారు.

మీ భవిష్యత్తు మీ చేతిలోనే

ప్రజాశక్తి - వీరఘట్టం

మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడి ఇష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో శత శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు బి సుంబర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, సమయం లేనందున వృథా చేయకుండా మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేందుకు చక్కగా చదువుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ అని చెప్పారు. అనంతరం వివిధ రకాల సినీ గేయాలకు విద్యార్థిని, విద్యార్థులు నృత్య ప్రదర్శన చేయడంతో ఆవరణమంతా కేరింతలతో దద్దరిల్లిపోయింది. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణకు మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిపాలనతో పాటు సచివాలయ నిర్వహణ, వివిధ సర్వేలు, సమావేశాలు వల్ల కార్యదర్శులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని, సెలవు రోజుల్లోనూ సర్వేల పేరుతో అవిశ్రాంతంగా పనిచేస్తున్నందున అనారోగ్యంగా, మానసికంగా, ఆవేదనకు గురవుతున్నామని వారన్నారు.

నేడు వినియోగదారుల సదస్సు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

అంతర్జాతీయ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల సదస్సును నిర్వహిస్తామని వినియోగ దారుల ఫోరం అధ్యక్షులు పెంటపాటి సూర్యరావు, ప్రధాన కార్యదర్శి మాన్యం రామకృష్ణ తెలిపారు. సదస్సుకు డిఇఒ డాక్టర్ నల్ల తిరుపతినాయుడు, డిఎంహెచ్ఒ భాస్కరరావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వినియోగదారుల ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పిన్నింటి ఈశ్వరరావు, నల్ల మధుసూదనరావు, శ్రీనివాసరావు, సన్యా సినాయుడు, అమలాపురం తవిటిరాజు, తదితరులు పాల్గొన్నా రు.

నేడు జియ్యమ్మవలస మండల సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. ఎంపిపి బొంగు సురేష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని కుమ్మరివలసలో తాగు నీటి సమస్యపై శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఎంపిడిఒ బివిజె పాత్రో స్పందించి సమస్యను పరిష్కరించారు. సంబంధిత అధికారులను మోటివేషన్ చేసి కుమ్మరివలస గ్రామంలో పాడైన బోరును బాగు చేయించి, మంచినీటి ట్యాంకును బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంపిడిఒకు అభినందనలు తెలిపారు.



కుళాయిల ద్వారా సరఫరా అవుతున్నతాగునీరు

టెన్త్ పరీక్షలకు 539 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 17 జరగనున్న పదో తరగతి పరీక్షలకు గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల నుంచి 539 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యూఒ బి.సురేష్ కుమార్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 3, కొమరాడులో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పై రెండు మండలాల్లోని 12 హై స్కూళ్ల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్లాస్టిక్ నిర్మూలనకు అంతా సహకరించాలని శుక్రవారం వీరఘట్టం మేజర్ పంచాయతీ ఇన్చార్జి ఇఒ ఎన్.కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రచారం చేపట్టారు. ఏప్రిల్ 1నుంచి ప్లాస్టిక్ వాడినా, విక్రయించినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని కోరారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం కొత్తగా నిర్మించిన విజయదుర్గాదేవి ఆలయంలో విజయదుర్గ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. ఆదివారం నాడు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టస్తారు. ఆదివారం నాడు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముదరక శ్రీనివాసరావు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సాలూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించి, వారికి న్యాయం చేయాలని, వారి న్యాయమైన కోర్కెలు తీర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. సాలూరు మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. సింహాచలం, నాగవంశం శంకర్రావు సిపిఎం నాయకులతో కలిసి సమ్మెకు మద్దతు తెలియజేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలూరు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు రెగ్యులర్‌గా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వకపోవడం కార్మికుల పట్ల పాలకవర్గం, అధికారుల చిత్తశుద్ధి ఏ పాటిదో తెలుస్తుందని అన్నారు. జిల్లాలో ఉన్న పురపాలక సంఘాల్లో గానీ, నగర పంచాయతీల్లో గానీ వేతనాలు, వ్యర్థాలు, మలినాలను తొలగించి శుభ్రతను అందించే కార్మికుల ఆకలి బాధలు పాలకులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సాలూరులో నేటికి నాలుగు రోజులుగా సమ్మె చేపడుతున్నా అధికారుల్లో చలనం లేదని ఇది కార్మికులను నిర్లక్ష్యానికి గురి చేయడం కాదా అని ప్రశ్నించారు. వెంటనే మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా వారికి మద్దతుగా ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, బి.సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు మామిడి శివ, రాజేష్, సుజాత, గంగయ్య, గంగరాజు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు..



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కార్మికులు



గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు నాయుడు, ఈశ్వరరావు

కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మడవలసలో సిపిఎం నాయకులు సూకురు రామారావు, రెడ్డి పారమ్మ ఆధ్వర్యంలో ప్రజాచైతన్యయాత్ర శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. 15ఏళ్ల క్రితం మడవలస, తురాయిపాడులో 46 గిరిజన కుటుంబాలకు రెండెకరాలు చొప్పున ప్రభుత్వం పట్టాలిచ్చి నేటికీ భూమి చూపించకపోవడం దుర్మార్గమన్నారు. పెద్దగెడ్డ జలాశయంలో సర్వం కోల్పోయి నిర్వాసితులైన గిరిజనులకు ఎటువంటి ఉపాధి లేక తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్వాసిత మత్స్యకారులకు వలలు, లైఫ్ జాకెట్లు, రక్షణ పరికరాలు సబ్సిడీ ద్వారా కల్పించి ఆదుకోవాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలపై భవిష్యత్తు పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. గుర్తించిన సమస్యలపై ఈనెల 24న తహశీల్దార్‌కు సమస్యలు అన్నింటి పైనా వినతి పత్రం ఇచ్చేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, స్థానిక నాయకులు సూకురు లక్ష్మణరావు, అడివమ్మా, కోడికాలు త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. శుక్రవారం శివన్నపేటలో ప్రజలకు సైబర్ క్రైమ్, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త నెంబర్ల నుంచి ఫోన్ చేసి అనేక ప్రలోభాలు పలికి నమ్మిస్తారన్నారు. అటువంటి వాటికి మోసపోకుండా దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ మద్యం సేవించకుండా అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి రహదారి భద్రతా నియమాలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వేతనదారులు

పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధి వేతనదారులకు ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉపాధి బిల్లు వెంటనే చెల్లించాలని, పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించి ఉపాధి కూలీలను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వేతనదారులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండుటెండల్లో రెండు పూటలా పనిచేస్తే ఆరువారాలుగా బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. పని చేసే చోట మంచినీరు, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించడంలేదన్నారు. అయినా మండుటెండలో రెండు పూటలా పనులు చేసినా వేతనాలివ్వడంలేదన్నారు. పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కాగితాడలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని కంబర సచివాలయం పరిధి కాగితాడ గిరిజన గ్రామంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ గర్భిణీలకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆవుదూడలకు టీకాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఆవుదూడలకు బ్రూ సెల్లా వ్యాధి రాకుండా నివారణా టీకాలను పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీతంపేటలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రూసెల్లా వ్యాధి వస్తే గర్భాశయం పోతుందన్నారు. కావున చిన్నప్పుడే దీని నివారణకు టీకా వేస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా నాలుగు నెలల నుంచి 8 నెలలు లేక ఏడాది ఆడదూడలకు నివారణా టీకా వేస్తున్నామని తెలిపారు. దీంతో పాటు ఆడదూడలకు చెవికి ట్యాగ్ వేస్తున్నామన్నారు. వీటిని ప్రతి పాడిరైతు తమ పశువులకు వేయించాలని సూచించారు. దీనిపై ఇప్పటికే గిరిజన గ్రామాల్లో పశు వైద్య, సచివాలయ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే మిగతా వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నామని తెలిపారు. ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాధి నిరోధక, గర్భాశయం టీకాలు వేస్తున్నామని అన్నారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని, దీన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది భాస్కరరావు, ప్రవీణ్, శంకరరావు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆదువూడకు టీకాలు వేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఐదో రోజుకు కార్మికుల సమ్మె

ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

స్థానిక పురపాలక సంఘంలో బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీను, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కె. ఈశ్వరరావు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ కార్మికుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న మున్సిపల్ కార్మికుల జీతాలు విషయంలో పాలకవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపించకపోవడం అన్యాయమని అన్నారు. కార్మికులు కాలు కదిపి నెత్తిన నీళ్లు వేసుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలో వచ్చాక కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని, స్థానిక సంస్థల నిధులు లేకుండా చేసి స్థానిక సంస్థల్లో పాలన గాలికి వదిలేసారని అన్నారు. నిధులు లేక పంచాయతీలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు కంపు కొడుతున్నాయని విమర్శించారు. సమస్యలపై పాలకవర్గం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ సాలూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శంకర్రావు, నాయకులు రవి, ఈశ్వరరావు, పోలరాజు కార్మికులు పాల్గొన్నారు.

కొనుగోలు చేశారు... మూలన పడేశారు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణాన్ని స్వచ్ఛ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఈ మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నిధులతో పట్టణంలో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్త, వ్యర్థాల్లో వేరు చేసిన అట్టడొక్కులను, కాగితాలను మడిచి ప్యాకింగ్ చేసి విక్రయించేందుకు హైడ్రాలిక్ ప్యాకింగ్ యంత్రాన్ని ఒకటి కొనుగోలు చేశారు. అలాగే కొబ్బరి బొండాల నుంచి పీచును తీసే యంత్రాన్ని అప్పటి కమిషనర్ రామఅప్పల నాయుడు కొనుగోలు చేశారు. సుమారు రూ.4లక్షలు వెచ్చించిన వీటిని కొనుగోలు చేసి నెలరోజుల పాటు వినియోగించారు. ఆ తర్వాత బెలగాంలో ఉన్న పాత అన్న క్యాంటీన్ భవనంలో మూలన పడేశారు. ఏ పని కోసం ఈ యంత్రాలనుకొనుగోలు చేశారో ఆ పనికి వినియోగించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలను వినియోగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని స్థానికులు, పర్యావరణ ప్రేమికుల విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు వీటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టి, స్వచ్ఛ పార్వతీపురం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది భావిస్తున్నారు.



మూలపడి ఉన్న కొబ్బరి బొండాల నుండి పీచును వేరు చేసిన, అట్ట డొక్కులను ప్యాకింగ్ చేసే యాత్రాలు

ఎటిఎం మోసగాళ్లు దొరికారు

ప్రజాశక్తి - పాలకొండ

ఎటిఎం దగ్గర కొంతమంది ఉండి నగదు తీయడానికి వచ్చిన వారికి సహాయం చేస్తామని నమ్మించి దోచుకున్న వారిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. జనవరి 6న పాలకొండ పట్టణంలో వడమకు చెందిన సవరపు థామస్ ఎస్‌బిఐ ఎటిఎం నుంచి నగదు తీయడానికి వెళ్లగా అక్కడ ఆయన తడబడడంతో క్యూలైన్లో ఉన్న ఇద్దరు వ్యక్తులు వచ్చి నగదు తీయడానికి సహాయం చేసినట్లు చేసి ఎటిఎంలో డబ్బుల్లేవని చెప్పి ఎటిఎం కార్డు మార్చి ఇచ్చారు. జనవరి 10లోగా థామస్ ఖాతా నుండి రూ.4 లక్షల 10వేలు విత్ డ్రా చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఆధారంగా వారిని గుర్తించారు. శుక్రవారం వాహన తనిఖీ చేస్తుండగా వారు పోలీసులకు చిక్కడంతో విచారించారు. ముంబైకి చెందిన విజయ్, డేవిడ్, అప్సర్ ఖాన్‌గా గుర్తించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి మోసాలు పలుచోట్ల వీరు చేసినట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం, చిత్తూరు జిల్లా మదనపల్లిలో కేసులు నమోదైనట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు ఎటిఎంల్లో ఉంటే వారికి సహాయం చేస్తామని నమ్మించి నేరాల పాల్పడినట్లు తెలిపారు. వీరి దగ్గర నుంచి రూ.4లక్షల 10వేలు నగదు, కారు, మొబైల్‌ఫోన్లు రెండు, 78 ఎటిఎం కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో సిఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయాగమూర్తి ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

కందకాల తవ్వకాలు

ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట వద్ద ఎలిఫెంట్‌జోన్ పేరుతో అటవీ అధికారులు కంధకాలు (ట్రెంచ్ కటింగ్) తవ్వే పనులు ఆపాలని, జనావాసాల మధ్య ఏనుగుల జోన్ ఏర్పాటు చేయడం తగదని సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 6 గ్రామాల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు పొంచివున్న పెనుముప్పు ఉందన్నారు. మండల ప్రజలకు కల్పతరువు. జీవనధారమైన ఈ కొండ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. వర్షాకాలంలో గెడ్డలు, వాగులతో చుట్టుపక్కల ఉన్న వెంకట్రాయుని చెరువు, గొట్టాపు చెరువు, అప్పయ్య బంధ, చెరువుల్లోకి నీరు పుష్కళంగా చేరి, కింది ఆయకట్టు గ్రామాల అప్పయ్య పేట, పెదభోగిల,సీతానగరం, బుడ్డి పేట, లక్ష్మి పురం గ్రామ రైతుల వ్యవసాయ భూములకు సుమారు 2వేల ఎకరాలకు సాగు నీరు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. దీంతో పాటు గుచ్చిమిలో గల తాన్నచెరువు, జోగంపేటలో గల కడుపువాని బంధ, కోమటి చెరువు ఆయకట్టు భూములకు కూడా ఈ కొండ నీరే ఆధారమని అన్నారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున జనావాసాల మధ్య జంతుసంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడమంటే ప్రజల ప్రాణాలకు ముప్పు తీసుకురావడమేనన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులు రాజకీయాలకు అతీతంగా అఖిలపక్షం ఏర్పాటు చేసి ఐక్య కార్యాచరణ రూపొందించి ట్రెంచ్ కటింగ్ పనులను ఏనుగుల జోన్ ఏర్పాటు అడ్డుకోవడానికి సహకరించాలని వారు కోరారు.

పెంట హెచ్ఎంను

సన్మానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పెంట జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింత రమణను ఎమ్మెల్యే బేబినాయన సన్మానించారు. విద్యార్థులు బాగా చదవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రధానోపాధ్యాయులు స్వీయ క్రమశిక్షణ విధించుకోవడంతో విద్యాశాఖ మంత్రి లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా కోటలో శుక్రవారం రమణను ఎమ్మెల్యే సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు పనిచేయాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు మంత్రి లోకేష్ పని చేస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పెంట గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి

చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబినాయన లబ్ధిదారులకు అందజేశారు. 11 మందికి మంజూరైన సుమారు రూ.15 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.




రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు డిడిఒ దినేష్‌కుమార్‌రెడ్డి

సంస్కృతి, సంప్రదాయాలతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - పాచిపెంట

సంస్కృతి, సాంప్రదాయాలతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి ఎస్.దినేష్ కుమార్ రెడ్డి అన్నారు. పాచిపెంటలో గల సరస్వతీ శిశు మందిరం వద్ద రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.6లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్య కాంతికై చైతన్యం పొందడం ద్వారా సమాజానికి సంస్కరణ జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో రామ్‌కీ ఫౌండేషన్‌తో కలిసి మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. రామ్‌కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతమైన పాచిపెంటలో మంచినీటి వసతి కల్పించడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలు ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. విద్యా వాచస్పతి పంచాది కృష్ణాజీరావు అధ్యక్షతనలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షులు పూసర్ల కనకరాజు, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, సర్పంచ్ పి.సంతోషి, బాలి విశ్వేశ్వరరావు, కప్ప కామరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న ఎంఇఒ అప్పలనాయుడు

ప్రతీ విద్యార్థి మొదటి తరగతిలో ఉత్తీర్ణులు కావాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, అదేవిధంగా ప్రతి విద్యార్థి మొదటి తరగతిలో ఉత్తీర్ణులు కావాలని ఎంఇఒ దత్తి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావివలస కెజిబివి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షకు సంబంధించి తగు సూచనలు, సలహాలను శుక్రవారం అందజేశారు. అలాగే పెన్నులు అందజేశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. శతశాతం లక్ష్యంగా పనిచేయాలని, ఇందుకు ప్రత్యేక కార్యాచరణ నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు కచ్చితమైన అవగాహన, శ్రద్ధవహించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఉత్తీర్ణత, అదే విధంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని కోరారు. శతశాతం ఫలితాలు సాధనే ప్రతి ఒక్కరికీ ధ్యేయం కావాలని పేర్కొ న్నారు.